


వీరసౌధలో గాంధీజీ విగ్రహం

మహాత్ముడిని.. మరిచారు..!



బెళగావిలోని వీరసౌధ

- బెళగావిలో కనిపించని శతాబ్ది సంబరాల సందడి
- 1924లో ఇక్కడే కాంగ్రెస్ సమ్మేళనంలో గాంధీజీ భాగస్వామ్యం
- ఒబామా రాక ఇంకా సందిగ్ధమే... ●ముందుకు సాగని ఏర్పాట్లు

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చలికాలం ఆరంభంలో బెళగావి పలు విధాలుగా వేడెక్కితోంది. మరో రెండు వారాల్లో శాసనసభ శీతాకాల సమావేశాలు సువర్ణసౌధలో జరగనున్నాయి. ఆ వెంటనే చారిత్రాత్మకమైన ఉత్సవం జరపాలని రెండు నెలల కిందటే తీర్మానించారు. రోజులు దగ్గరపడుతున్నా సంబరానికి సంబంధించి సందడే కరువయ్యిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుందానగరి బెళగావిలో మహాత్మా గాంధీ అధ్యక్షతన 1924లో చారిత్రాత్మక కాంగ్రెస్ సమ్మేళనం జరిగింది. ఆ చరిత్రను స్మరించుకుంటూ అంతర్జాతీయస్థాయిలో ఆకర్షించేలా వందేళ్ల ఉత్సవాలను జరపాలని ప్రభుత్వం తీర్మానించింది. అయితే ప్రారంభంలో చూపిన ఉత్సాహం ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళికలపై ఇటీవల రెండు వారాలుగా చడీ చప్పుడు లేకుండాపోయింది. శతాబ్ది ఉత్సవ సమితి స్థలాన్ని పరిశీలించడం మినహా ఇప్పటివరకు ఎటువంటి ఏర్పాట్లను ప్రారంభించలేదు. గాంధీజీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ సమ్మేళనానికి సాక్షిగా బెళగావి నిలిచింది. 1924 డిసెంబరు 25, 26 తేదీల్లో బెళగావిలోని టిలకవాడిలో సమ్మేళనం జరిగింది. సమ్మేళనానికి గుర్తుగా వీరసౌధను నిర్మించారు. శతాబ్ది సంబరం వేళ ఈ స్థలం కేంద్రబిందువైంది.

రాష్ట్రప్రభుత్వం చారిత్రాత్మక కాంగ్రెస్ సమ్మేళన శతాబ్ధి సంబరానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి గౌరవాధ్యక్షుడిగా వీరప్పమొయిలీ, అధ్యక్షుడిగా రాష్ట్ర శాసనసభ వ్యవహారాలు హెచ్‌కే పాటిల్ నేతృత్వంలో సమావేశం ఇటీవల జరిగింది. వీరసౌధతోపాటు ఇతర స్థలాలను పరిశీలించారు. శతాబ్ది సంబరానికి మిగిలింది కేవలం నెలరోజులు మాత్రమే అయినా ఏర్పాట్లు ఊపందుకోలేదని స్థానికంగా బెళఅసంతృప్తి వ్యక్తమవుతోంది.

శతాబ్ది సంబరాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అర్థవంతంగాను రచనాత్మకంగాను నిర్వహించేందుకు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం గాంధేయవాదులు, సీనియర్లతో చర్చించి సమ్మేళనం చరిత్రను తిరిగి సృష్టించేలా చేయడమే ప్రధాన ఉద్దేశంగా ఉంది. బెళగావి జిల్లా యంత్రాంగం నుంచి కాంగ్రెస్ సమ్మేళనానికి సాక్షిగా ఉండే టిలకవాడి వీరసౌధ, కనబరగెలో ఉండే గంగాధరరావు పాండే స్మారకం, హుదలిలోలో ఉండే మహాత్మాగాంధీ స్మారకంతోపాటు, లెలె మైదానం, సీపీఎడ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

అయితే ఏ స్థలంలో ఎటువంటి వేదిక ఏర్పాటు చేయాలని, ఏ విధమైన కార్యక్రమాలను అమలు చేయాలనేది ఇప్పటివరకు ఖరారు చేయలేదు. శతాబ్ధి సంబర కమిటీకి ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసింది. జిల్లా యంత్రాంగానికి రూ.2కోట్లు విడుదల చేశారు. విడుదలైన గ్రాంట్లతో కూడా కనీసమైన చర్యలు కొనసాగలేదు.

వీరసౌధకు మరమ్మతులు చేపట్టాలి

టిలకవాడిలోని వీరసౌధ ఉద్యానవనం ఉత్తమంగా నిర్వహిస్తున్నా మరిన్ని మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉంది. ఉద్యానవనంలో పక్షులు, వన్యప్రాణులు, కళాకృతులకు రంగులు వెలసి పోయాయి. ప్రత్యేకమైన శౌచాలయ వ్యవస్థ లేదు. ఇదే ప్రాంతలోని కాంగ్రెస్ బావిని స్వచ్ఛం చేయాల్సి ఉంది. మహనీయుల శిల్పాలతో ఉండేగోడలు బీటాలు వారాయి. వీటిని సరిచేయాల్సి ఉంది. అయితే అలాంటి చర్యలేవీ ఇప్పటి దాకా ప్రారంభించనే లేదు.

ఒబామా రాక ఇంకా సందిగ్ధమే...

కాంగ్రెస్ శతాబ్ధి సమ్మేళనానికి అమెరికా మాజీ అధ్యక్షుడు బరక్ ఒబామాను ఆహ్వానిస్తూ సీఎం సిద్ధరామయ్య ప్రత్యేకంగా లేఖ రాశారు. అయితే ఇప్పటివరకు ఒబామా నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఒబామా లేఖకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోంది. ఒబామా నుంచి అనుమతి లభిస్తే ఏర్పాట్లు మరింత అనుకూలంగా కానుందని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. మహాత్మాగాంధీ పట్ల ప్రత్యేక అభిమానం కల్గినవారిలో బరక్ ఒబామా కూడా ఒకరు. అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించిన ఒబామాను ఆహ్వానించి సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

9 నుంచి శాసనసభ సమావేశాలు

శాసనసభ శీతాకాల సమావేశాలు డిసెంబరు 9న ప్రారంభం కానున్నాయి. 11రోజులపాటు సమావేశాలు కొనసాగనున్నాయి. డిసెంబరు 20వరకు సీఎం, డీసీఎంలతోపాటు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అక్కడే ఉంటుంది. అప్పట్లో పూర్తిస్థాయిలో శాసనసభ సమావేశాలకే అధికారులు, పాలకులు సమయం కేటాయించాల్సి ఉంటుంది. దీంతో సమీక్షలు జరగవచ్చుగానీ ఏర్పాట్లు కొనసాగించడం అంత సులువుకాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ లోగా శతాబ్ది ఉత్సవాల పనులు ప్రారంభించాలని పలువురు భావిస్తున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- భర్త మరణ సమాచారంతో భార్య కన్నుమూత
- దావణగెరె జిల్లాలో విషాదం



కస్తూరి రంగప్ప, జయమ్మ (ఫైల్)

మరో బాలింత మృతి



- నాలుగుకు చేరిన మృతుల సంఖ్య
- బళ్లారి గోషా ఆసుపత్రిలో కలకలం



అమృత మహోత్సవాలకు సిద్ధమైన బళ్లారి చర్చి

అమృత మహోత్సవాలకు సిద్ధం

- నేడు సీఎం సిద్ధరామయ్య రాక

ప్రసిద్ధిచెందిన బళ్లారిలోని ఆరోగ్య మాత చర్చి అమృత మహోత్సవాలకు ముస్తాబైంది. సీఎం సిద్ధరామయ్య బుధవారం హాజరు కానున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి క్రైస్తవులు వేడుకలకు రానున్నారు.

8



సిద్దూకు మరో సవాల్..!

- పరిషత్‌లో ఖాళీకానున్న నాలుగు స్థానాలు
- పోటీ పెరగడంతో తర్జనభర్జన

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపు ఉత్సాహంలో ఉన్న సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రామనగర జిల్లా చన్నపట్టణ, హావేరి జిల్లా శిగ్గావి, బళ్ళారి జిల్లా సండూరు స్థానాల్లో గెలుపు సాధించడంతో శాసనసభలో అధికార కాంగ్రెస్ బలం 138కి పెరిగింది. బీజేపీకి 66, జేడీఎస్‌కు 19 స్థానాలలో ఒక్కో స్థానం కోల్పోవడంతో బీజేపీ బలం 65కు, జేడీఎస్ బలం 18కి తగ్గినట్టయింది. ఈనెల 23న ఫలితాలు వెలువడిన నాటి నుంచి సీఎం, డీసీఎంలతోపాటు కాంగ్రెస్ వర్గమంతా సంతోషంలో ఉంది. అయితే పరిషత్‌లో నాలుగు స్థానాలకు నామినేటెడ్ చేయాల్సి ఉంది. పరిషత్‌లో సభాపతితోపాటు విధానపరిషత్‌కు 75 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల సీపీ యోగేశ్వర్ బీజేపీ నుంచి కొనసాగుతున్న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. పరిషత్ సభ్యులు యూబీ వెంకటేశ్, ప్రకాశ్ రాథోడ్‌ల పదవీకాలం గత నెలలోనే ముగిసింది. ప్రకాశ్ రాథోడ్‌కు వరుసగా రెండు సార్లు నామినేటెడ్ విధానంతో ఎమ్మెల్సీని చేశారు. దీంతో మూడోసారి కొనసాగించడం అంత సులువు కాదు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆప్తుడైన యూబీ వెంకటేశ్‌కు 2023 శాసనసభ ఎన్నికల్లో బసవనగుడి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న ఆయనకు ఎమ్మెల్యే టిక్కెట్ కూడా ఇచ్చారు. ప్రస్తుతం మరోసారి ఎమ్మెల్సీగా కొనసాగించే అవకాశాలు అంతంతమాత్రమే అనిపిస్తోంది. ఇలా నలుగురు ఎమ్మెల్సీలను నామినేట్ చేసేందుకు అవకాశం ఉంది. విభిన్నమైన రంగాలలో సాధకులై ఉండి కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైనవారికి అవకాశం కల్పించదలిచారు. అయితే జాబితా రోజూ పెరుగుతుండడంతో సీఎం సిద్దరామయ్య ఎటూ తేల్చలేకపోతున్నారు. ఎమ్మెల్సీలను ఖరారు చేసే విషయంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు పలువురు పేర్లను సూచించే అవకాశం ఉంది. ఎవరికి వెనుకడుగైనా పార్టీలో భిన్నస్వరాలు తారస్థాయికి చేరుతాయి. ఇది ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే కాకుండా ప్రతి విషయంలోనూ కొనసాగుతున్న తంతే. పైగా అధిష్ఠానం కూడా ఎవరినైనా సిఫారసు చేసే అవకాశాలు కూడా లేకపోలేదు. ప్రస్తుతం ప్రధానంగా వినిపిస్తున్నవారి పేర్లలో మాజీ ఎంపీ ఉగ్రప్ప, సీఎస్ ద్వారకనాథ్, బాలరాజ నాయక్, బిఎల్ శంకర్, వినయ్ కార్తీక్, నటరాజ్‌గౌడ, ప్రకాశ్‌రాథోడ్‌తోపాటు యూబీ వెంకటేశ్‌ల పేర్లు కూడా ఉన్నాయి. పలువురు మాజీ మంత్రులు పరిషత్‌లో ప్రవేశించేందుకు తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు. గవర్నర్ ఆమోదించాల్సిన అవసరం కూడా ఉంది. వివాదం తీవ్రమైతే అధిష్ఠానం ఈ విషయంలోనూ జోక్యం చేసుకోక తప్పదని తెలుస్తోంది.

డిసెంబరు 9వ తేదీ నుంచి శాసనసభ శీతాకాల సమావేశాలు బెళగావి సువర్ణసౌధలో ఆరంభం కానున్నాయి. రెండు వారాలపాటు జరిగే శాసనసభ సమావేశాల్లో నలుగురు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేట్ ఖరారు చేసే అవకాశం ఉంది.



అంబేడ్కర్ విగ్రహానికి సీఎం పుష్పాంజలి

రాజ్యాంగ వ్యతిరేకుల నుంచే మార్పు మాటలు

- పటిష్ట రాజ్యాంగం మన అదృష్టం ● అందరికీ న్యాయం చేసిన ధర్మగ్రంథం ● సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వ్యతిరేకులనుంచే మార్పు మాటలు వస్తుంటాయని, కాంగ్రెస్ పార్టీ నిరంతరం రక్షణకోసం పోరాటం చేస్తుందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. మంగళవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవం, ప్రజాప్రభుత్వ విజయవంతానికి శ్రమించిన జిల్లా అధికారులు, ప్రజా సంఘాల ముఖ్యులకు సత్కార కార్యక్రమంలో సీఎం ముఖ్యులుగా పాల్గొన్నారు. మనదేశంలో రాజ్యాంగ వ్యతిరేకులు ఉన్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్రిటీష్ పోరాటంలో పుట్టిన ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనలేదన్నారు. అందరికీ సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యం లభించాలని అంబేడ్కర్ ఆశయంగా ఉండేదన్నారు. ప్రపంచంలోని పలు రాజ్యాంగాలను అధ్యయనం చేసి మన రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగ ఆశయాలను సమగ్రంగా అర్థం చేసుకోవాలని, ప్రభుత్వం పార్టీ ఏదైనా రాజ్యాంగానికి అనుగుణంగానే వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ ఆశయాలను సాధించే దిశగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. 850 ఏళ్లక్రితమే బసవణ్ణ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పిలుపునిచ్చారని కానీ ఇప్పటికే సమాజంలో రూపుమాపలేదన్నారు. ప్రపంచంలో అత్యధిక కాలం జారీలో ఉన్న రాజ్యాంగం మనదన్నారు. ఎంతో పటిష్టమైనది కావడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ స్వతంత్ర భారత ప్రజా ప్రభుత్వ వ్యవస్థలో మన రాజ్యాంగం దేశప్రజలను శక్తివంతులను చేస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రులు మహదేవప్ప, భైరతి సురేశ్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ తోపాటు పలువురు పాల్గొన్నారు. రిటైర్డు జస్టిస్ నాగమోహన్‌దాస్‌తో పాటు పలువురిని సత్కరించారు. అంతకుముందు విధానసౌధలో వాకథాన్‌కు జెండా ఊపి ప్రారంభించారు. విధానపరిషత్ సభాపతి బసవరాజహొరట్టితోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. కేపీసీసీ కార్యాలయంలోనూ రాజ్యాంగ దినోత్సవాన్ని జరిపారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



విధానసౌధ వద్ద ప్రత్యేక వాకథాన్‌కు పచ్చజెండా ఊపుతున్న సీఎం

నాయకత్వ లక్షణాలతో సాగండి

- విద్యార్థులకు నౌకాయాన అధికారుల సూచన



విద్యార్థులతో నౌకాయాన అధికారులు

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగాలని నౌకాయన అధికారులు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ ఆధ్వర్యంలో శివమొగ్గ క్యాంపస్‌లో నలుగురు నావల్‌బేస్ అధికారులతో ప్రత్యేక చర్చాగోష్ఠి నిర్వహించారు. కమాండర్లు దీపక్ ధనఖేర్, ఎస్‌ఎసీ సింగ్, అభినవ్ నెహ్రా, అమృత్ తురాన్ పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. తొలుత క్యాంపస్‌లో మొక్కలు నాటారు. యూనివర్సిటీ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కావేరి టాండన్ అధికారులను ఆత్మీయంగా స్వాగతించారు. ఎస్‌ఎస్‌పీ సింగ్ తన ప్రసంగంలో యుద్ధంలో రక్తం చిందించడం కంటే శాంతి కోసం చెమట పట్టేలా శ్రమించాలన్నారు. విద్యార్థులకు వారి లక్ష్యాలకు అనుగుణంగా ఎలా సాగాలో సూచించారు. నాయకత్వ లక్షణాలు, నిజాయితీ, ధైర్యం వంటివి జీవితం ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. దేశ భద్రతలో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ తరహాలోనే నేవీ కూడా ఎంతో కీలకమైనదన్నారు. ఇదే సందర్భంగా తమ ట్రైనింగ్‌వేళ పొందిన అనుభవాలను విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తినింపారు.



చర్చాగోష్ఠిలో కమాండర్లు దీపక్, సింగ్, అభినవ్, అమృత్ తురాన్



బీదర్ ర్యాలీలో బీజేపీ సీనియర్ నేత యత్నాళ్

వక్ఫ్ హఠావో దేశ్ బచావో

- వక్ఫ్‌కు వ్యతిరేకంగా యత్నాళ్ పోరాటం ● బీదర్ నుంచి శ్రీకారం ● యడియూరప్ప వ్యాఖ్యలపై ధ్వజం

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల రైతులకు వక్ఫ్ ఆస్తులుగా నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ రెబెల్ నేత, సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ నేతృత్వంలో 'వక్ఫ్ హఠావో దేశ్ బచావో' నినాదంతో పోరాటానికి శ్రీకారం చుట్టారు. బీదర్ నుంచి ప్రారంభమైన పోరాటయాత్ర డిసెంబరు 25న బెంగళూరులో ముగియనుందని ప్రకటించారు. యత్నాళ్ పోరాటానికి ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళి, మాజీ ఎంపీ జీఎం సిద్దేశ్వర్, మాజీ మంత్రి అరవింద లింబావళి, మాజీ మంత్రి కుమార బంగారప్పతోపాటు పలువురు భాగస్వామ్యులయ్యారు. యత్నాళ్ మాట్లాడుతూ వక్ఫ్‌చట్టం దేశాన్ని పాకిస్థాన్‌గా మార్చే కుట్రగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా రికార్డులలో వక్ఫ్‌కు 9.5 లక్షల ఎకరాల ఆస్తి ఉందని అయితే ఇటీవల 38 లక్షల ఎకరాలు వక్ఫ్ ఆస్తిగా డిమాండ్ పెట్టారన్నారు. ఇది నాలుగు పాకిస్థాన్‌లకు అయ్యేంత ఆస్తి అన్నారు. వక్ఫ్‌బోర్డు అక్రమాలపై ప్రతి పల్లెలోనూ తిరుగుతామన్నారు. కాగా వక్ఫ్‌కు సంబంధించిన వివాదంపైనే ఉప ఎన్నికలకు ముందు విజయపురలో బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర సందర్శించినప్పుడు యత్నాళ్ బృందం దూరంగా ఉంది. కాగా సొంత పార్టీపైనే వ్యతిరేకం సరికాదని యత్నాళ్‌ను ఉద్దేశించి యడియూరప్ప వ్యాఖ్యానించారు. వక్ఫ్ పోరాట సభలో సోమవారం యత్నాళ్ పలు ఆరోపణలు చేసిన సంగతి విదితమే. ఉప ఎన్నికల్లో ఓటమికి తండ్రీ కొడుకులే కారణమని వ్యాఖ్యానించడంపై యడియూరప్ప స్పందించారు. ఉప ఎన్నికల్లో ఓటమికి నేను, విజయేంద్ర కారణం కాదన్నారు. సొంతపార్టీకి వ్యతిరేకంగా పోరాటం ఎందుకని కలసి పనిచేయాలని యడియూరప్ప హితవు పలికారు. అందుకు యత్నాళ్ ధీటుగానే స్పందించారు. తాను సీఎం అయ్యేందుకు పోరాటం చేయడం లేదని, మీకెందుకు టెన్షన్ అంటూ బదులిచ్చారు. వక్ఫ్‌కు వ్యతిరేకంగా పోరాటం, సామాన్యుల కష్టాలలో పాలు పంచుకోవాలని మాత్రమేనని, అధికారం కోసం కాదన్నారు. రైతు ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగిస్తానన్నారు.

మళ్లీ కేబినెట్‌లోకి నాగేంద్ర!



- ఎన్నికల ప్రచారంలో సీఎం సిద్దరామయ్య హామీ
- విస్తరణ కోసం అనుచరుల ఎదురుచూపు

బళ్లారి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలతో మంత్రి పదవికి రాజీనామా చేసిన నాగేంద్రను మళ్లీ కేబినెట్‌లోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. నాగేంద్రకు సిద్దరామయ్య కేబినెట్‌లో బెర్త్ దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తోంది. అయితే ఏ శాఖ ఇస్తారనేది స్పష్టత లేదు. మంత్రి వర సమావేశం తర్వాత నాగేంద్రకు పదవి ఇస్తారని కాంగ్రెస్ వర్గాలతో పాటు కొందరు ఎమ్మెల్యేలు అభిప్రాయ పడుతున్నారు. బళ్లారి రూరల్ నుంచి గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి. కాకలు తీరిన నాయకుడిగా పేరొందిన మాజీ మంత్రి బి. శ్రీరాములుపై నాగేంద్ర అఖండ విజయం సాధించారు. అప్పటికే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాగేంద్రకు పైగా శ్రీరాములుపై గెలవడంతో కేబినెట్‌లో కీలక హోదా దక్కింది. అనూహ్య పరిణామాలతో ఆయన పదవి కోల్పోవాల్సి వచ్చింది. ఎస్టీ కార్పొరేషన్‌లో రూ.189 కోట్లు అక్రమాల అవినీతి ఆరోపణలతో రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈడీ అరెస్టుతో దాదాపు 100 రోజులు జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవల బెయిల్‌పై ఆయన బయటికి వచ్చారు. వాల్మీకీ నిగమ మండలిలో ఏ అవినీతి జరగలేదు. అని ఏకంగా సీఎం సిద్దరామయ్య సర్టిఫికేట్ ఇచ్చారు. నాగేంద్రకు మళ్లీ మంత్రి పదవి ఇస్తామని బహిరంగంగా ప్రకటించారు. నాగేంద్రకు కేబినెట్‌లోకి తీసుకువస్తే కొందరు మంత్రులకు శాఖల మార్పు కూడా తప్పదని అనిపిస్తోంది. కొందరు పాత మంత్రులను తప్పించి కొత్తగా కొందరిని మంత్రు పదవులు ఇవ్వాలని కూడా కాంగ్రెస్ అధిష్టానం ఢీల్లీ నుంచి సంకేతాలు వచ్చినట్లు సమాచారం. నాగేంద్ర వర్గీయులు మాత్రం నేడు, లేదా రేపు లో మంత్రి పదవి ప్రకటించే అవకాశం ఉంది. లేదా మరో వారంలో మంత్రి వర్గం అత్యవసర సమావేశం ఉంటుంది. అప్పుడు మంత్రి పదవి వరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అతనెవరు... మమ్మల్ని కొన్నారా..? ● సీపీ యోగేశ్వర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన జేడీఎస్ ఎమ్మెల్యే / బెంగళూరు నగరం కాదు... ఎంతోమందికి జీవనాడి 7లో

ఆటల్లాడించేవారేరీ ?

- స్కూళ్లలో వ్యాయామ ఉపాధ్యాయుల కొరత
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- కుంటుపడుతున్న వ్యాయామ విద్య
- ఉమ్మడి జిల్లాకు మంజూరైన పోస్టులు 544, వర్కింగ్ పోస్టులు 400
- గత ప్రభుత్వంలో ఒక్కటీ భర్తీ చేయని వైనం



సత్యసాయి జిల్లా ముద్దిరెడ్డిపల్లిలో క్రీడా పోటీల్లో విద్యార్థులు (ఫైల్)

అనంతపురం విద్య, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్కూళ్లలో పీడీలు, పీఈటీలు లేక వ్యాయామ విద్య కుంటుపడుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏళ్ల తరబడి వ్యాయామ టీచర్ల కొరత వేధిస్తోంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎలాంటి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ విద్యతో పాటు వ్యాయామ విద్య నిర్వీర్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యాశాఖ అధికారులు సమాచారం మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంజూరైన పోస్టులు 544 ఉండగా, 400 మంది పని చేస్తున్నారు. మరో 144 పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో చాలా స్కూళ్లలో విద్యార్థులకు క్రీడలు నేర్పించే వారే లేకుండాపోయారు.

స్కూళ్లకు గ్రాంట్ ఇవ్వాలి

కేజీబీవీల్లో పీఈటీలతో ఉదయం 6 గంటల నుంచి 10గంటల వరకూ, సాయంత్రం 3.30 గంటల నుంచి 6.30 గంటల వరకూ పని చేయిస్తున్నారు. సాయంత్రం 6.30 గంటలకు పని ముగించుకుని ఇంటికెళ్లేందుకు రాత్రి అవుతోంది. మహిళా వ్యాయామ టీచర్లకు ఇబ్బంది లేకుండా ఉదయం 7 నుంచి 11 వరకు, సాయంత్రం 3 నుంచి 5.30 గంటల వరకూ వర్క్ సమయం మార్చాలని డిమాండ్ చేస్తున్నాం.

- అక్కులప్ప, జిల్లా అధ్యక్షుడు, ఏపీపీఈటీ అండ్ ఎస్‌ఏపీఈ యూనియన్

వ్యాయామ టీచర్లపై పనిభారం

జిల్లాలో చాలా స్కూళ్లలో విద్యార్థులు ఎక్కువగా ఉండటం, పీడీ లేదా పీఈటీ ఒక్కరే ఉంటున్నారు. 600 మంది, 800 మంది విద్యార్థులున్న చోట కూడా ఒక్కరే పీడీ లేదా పీఈటీ ఉంటున్నారు. ఇలాంటి చోట క్రీడల బోధన తలకు మించిన భారంగా మారింది. దీంతో విద్యార్థులకు సక్రమంగా వివిధ క్రీడలు నేర్పించలేని పరిస్థితి నెలకొంది. స్కూళ్లలో విద్యార్థులకు కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్, చెస్, క్రికెట్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, బేస్‌బాల్, హాకీ, రగ్బీ, సాఫ్ట్‌బాల్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, క్యారమ్స్, త్రోబాల్, వాలీబాల్ వంటి సుమారు 53 రకాల క్రీడలపై తర్ఫీదు ఇవ్వాలి. ఆయా ప్రాంతాల్లో విద్యార్థుల ఆసక్తిని బట్టి శిక్షణ ఇవ్వడంతోపాటు, వారిని పోటీలకు సిద్ధం చేయించాలి. అయితే స్కూళ్లలో పీడీలు, పీఈటీల కొరత వల్ల విద్యార్థులకు సక్రమంగా ఏ క్రీడలను నేర్పించలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు వారి ఉజ్వల భవిష్యత్తు నష్టపోతున్నారు.

కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో మరింత ఇబ్బందులు

కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో వ్యాయామ టీచర్లు మరింత ఇబ్బంది పడుతున్నారు. కేజీబీవీల్లో పనిచేసే మహిళా వ్యాయామ టీచర్లను ఉదయమే వచ్చి, సాయంత్రం చీకటిపడ్డాక వెళ్లమని చెబుతున్నారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో ఆయా టీచర్లపై ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ, సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకూ సమయం కేటాయించాలని వారు కోరుతున్నారు. మోడల్ స్కూళ్లలో సైతం ఒక్క పీఈటీనే ఉంటున్నారు. సుమారు 600 మంది వరకూ విద్యార్థులు ఉండటం వల్ల పనిభారం అధికమవుతోందని, అదనంగా మరో వ్యాయామ టీచర్‌ను కేటాయించాలన్న డిమాండ్ ఉంది.

డీఎస్సీలో పీడీ పోస్టులు భర్తీ చేయాలి

స్కూళ్లలో చదువుతోపాటు క్రీడలు కూడా అత్యంత కీలకం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 544 పీడీ పోస్టులు మంజూరైనా వందలాది స్కూళ్లలో పీడీలు కొరత ఉంది. చాలా స్కూళ్లలో పీడీ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి.

-మొరార్జీ యాదవ్, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ



గుమ్మఘట్టలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

పాఠశాలకు పీడీలు కీలకం

పాఠశాలల్లో విద్య ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరం. పాఠశాల స్టాఫ్ అంతా విద్యాభివృద్ధికి తోడ్పడితే క్రీడల పట్ల పిల్లలకు ఆసక్తి పెంచేది పీడీ ఒక్కరే. విద్యార్థులు మానసిక ఉల్లాసానికి క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ పాఠశాలను క్రమశిక్షణలో ఉంచగలుగుతారు.

- యశోధర, విద్యా కమిటీ చైర్‌పర్సన్, గుమ్మఘట్ట

ఆటలు మరచిపోయాం



పాఠశాలలో రెండేళ్లుగా పీడీ లేకపోవడంతో ఆటలు మరచిపోయాం. క్రీడల్లో ఆసక్తి ఉన్నప్పటికీ శిక్షణ ఇచ్చేవారు లేక దూరం అవుతున్నాం. మాకు పీడీ సార్ వచ్చేలా చూడాలి. ఆటలపై మాకు శిక్షణ ఇచ్చేలా చూస్తారని ఆశిస్తున్నాం.

- పల్లవి, విద్యార్థిని, గుమ్మఘట్ట

గుమ్మఘట్ట : మండల పరిధిలో 11 ఉన్నత పాఠశాలలు ఉండగా గత రెండేళ్లుగా రెండు పాఠశాలల్లో మాత్రమే పీడీలు పని చేస్తున్నారు. మిగతా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవ డంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. మండలంలో ఉన్నత పాఠశా లల్లో 4266 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే కేవలం తాళ్లకెర పాఠశాలలో 371 మంది, నేత్రపల్లి పాఠశాలలో 531 మందికి మాత్రమే పీడీలు ఉన్నారు. ఈ పాఠశాల విద్యార్థులకు మాత్రమే వ్యాయామ విద్య అందుతోంది.

కామెడీ వీరా..!

కామెడీ షాపు పేరుతో యూట్యూబ్ చానల్
నెటిజన్ల ఆదరణ పొందుతున్న ఆటోడ్రైవర్ వీరా



వీడియో చిత్రీకరణ

పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ, తమ సృజనాత్మకతకు పదును పెడుతూ కొంతమంది యువత అనతి కాలంలోనే బాగా ఫేమస్ అవుతున్నారు. ఒక్కరిగానే కాకుండా తమ స్నేహితులతో కలిసి బృందంగా ఏర్పడి కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందుతున్నారు. అలాంటి కోవకు చెందిన వారే ఉరవకొండకు చెందిన వీరాంజనేయులు ఉరఫ్ వీరా అతడి మిత్ర బృందం.

ఉరవకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వీరాంజనేయులు అతడి మిత్ర బృందం చిన్న చిన్న పనులు చేసుకునే కార్మికులు. వారందరూ ఒక బృందంగా ఏర్పడి కామెడీ షాపు పేరుతో వీడియోలను తీస్తూ ఎంతో మంది నెటిజన్ల ఆదరణ పొందుతున్నారు. బృందంలోని సభ్యులకు సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేదు. కానీ సృజన ఉంది. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, అధునాతమైన కెమెరాలు లేవు. కానీ ఏదో ఒకటి చేయాలనే తాపత్రయం ఉంది. అందుకే అందుబాటులో ఉన్న ఫోన్లతోనే, తమకు తెలిసిన పరిజ్ఞానంతోనే వీడియోలు తీస్తూ కామెడీషాపు చానల్‌తో దూసుకెళ్తున్నారు. వారు తీసిన వీడియోలు ఏపీ, తెలంగాణా, కర్ణాటకలో ని తెలుగువారి ఆదరణ పొందుతున్నాయి. హాస్యం ప్రధానంగా వీడియోలు రూపొందిస్తున్నారు. అప్పుడప్పుడు సందేశాత్మకంగా, సమకాలీన సమాజంలో జరిగే అంశాలు, సంఘటనలతో కూడా లఘుచిత్రాలు రూపొందిస్తూ వీక్షకులను అలరిస్తున్నారు. వారు రూపొందించిన వకీల్‌సాబ్, అఖండ, వ్యాట్సాప్ పే తదితర వీడియోలకు ప్రజలనుంచి మంచి ఆదరణ లభించింది.

కామెడీ షాపు పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభం

ఉరవకొండకు చెందిన వీరాంజనేయులు ఆటో డ్రైవర్. ఆటోనే అతడి జీవనాధారం. డిగ్రీ వరకూ చదువుకున్నాడు. చిన్నప్పటి నుంచి సినిమాల పట్ల ఉన్న ఆసక్తితో యాక్టర్ కావాలనుకున్నాడు. ఈక్రమంలోనే ఎక్కడికో సుదూర ప్రాంతాలకు వెళ్లి, వాళ్లని, వీళ్లని ప్రాధేయపడేకంటే తనే సొంతంగా వీడియోలు రూపొందించి, ట్యాలెంట్ నిరూపించుకోవాలనుకున్నాడు. ఈక్రమంలోనే తన మిత్రులతో కలిసి 2016లో వీరు కామెడీ షాపు పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించాడు. తన మిత్రులైన మల్లికార్జున, ఆరిఫ్, ప్రదీప్, ఓబులపతి, నూర్‌బాషా, మల్లికార్జునతో కలిసి సందేశాత్మక, హాస్యాన్ని పంచే 400పైగా వీడియోలు తీశారు. వీటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిని 30లక్షల మందికిపైగా చూశారు. తన లఘుచిత్రాలో నటించేవారంతా బారామసాల చేసేవారు, మెకానిక్, క్యాబ్‌డ్రైవర్, వంటమనిషి, భవననిర్మాణ కార్మికులు అని వీరాంజనేయులు పేర్కొన్నాడు.

సినిమాల్లో నటించాలన్నదే ధ్యేయం: వీరా



సినిమాల్లో నటించాలన్నదే నా ధ్యేయం. ఇప్పటికే రాధ మాధవం అనే సినిమాలో విలన్ పక్కన కమేడియన్‌గా నటించా. చానల్ ప్రారంభంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా. నెలకు ఆరు వీడియోలు తీస్తున్నాం. రూ.8వేల దాకా ఆదాయం వస్తోంది. మా వీడియోల ద్వారా పంచుతున్న హాస్యం చూసి గతంలో విమర్శించిన వారే ఇప్పుడు పొగుడుతుండటంతో ఎంతో సంతోషం కలుగుతోంది.

న్యూస్‌బాక్స్



అలంకరణలో స్వామివారు

నేమకల్లు అంజన్నకు వెన్న అలంకారం

బొమ్మనహాళ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి మంగళవారం వెన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాసం సందర్భంగా చివరి మంగళవారం స్వామివారికి విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ చార్యులు, సంతోష్ కుమార్ చార్యులు పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్యవిసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించిన అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు.

రానున్న మూడు రోజులకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో తుపానుగా మారిందన్నారు. ఈ ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో తేలిక పాటి నుంచి పలు చోట్ల ఓ మోస్తారు వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. పలు చోట్ల ఉరుములుతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు.

నేడు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

అనంతపురం విద్య, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ బుధవారం జిలాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విద్యాశాఖాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మండల విద్యాశాఖాధికారులతో కలెక్టర్‌తో కలసి సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా అపార్, ఇతర అంశాలపై ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్ష నిర్వహించనున్నారు. దీనిపై డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ...ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన ఉంటుందని స్పష్టం చేశారు.

గోవిందా..!
గోల్‌మాల్

ఖాద్రీశుడి ఆలయానికి తలనీలాల టెండర్లలో తగ్గిన ఆదాయం

- గత ఏడాది రూ.1.77 కోట్లు...
- ప్రస్తుతం రూ.76లక్షలు తగ్గింపు
- టెండర్లు లేకుండానే మరో సంవత్సరం అప్పగింతకు ఆర్డర్లు
- గోల్‌మాల్ వ్యవహారం అంటూ భక్తుల ఆగ్రహం



కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కదిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తలనీలాల టెండర్లలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. సార్వత్రిక ఎన్నికల సమయంలో టెండర్లు జరగడంతోనే ఈ ఆరోపణలు ఎక్కువయ్యాయి. టెండర్లు అప్పగించిన విధానమే అనుమానాలకు తావిస్తోంది. గతంలో రూ.1.77కోట్లు పలికిన తలనీలాల టెండరును ఈఏడాది రూ.1.01 కోట్లకే అప్పగించడంపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. అదికూడా మరో సంవత్సరం అదే సంస్థకు ఇచ్చేలా దేవదాయ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆలయ వర్గాలు చెబుతున్నారు. మొత్తం మీద ఈసంవత్సరం ఈటెండర్లు లేకుండా, వచ్చే సమయం అసలే టెండర్లు లేకుండా అదే సంస్థకు అప్పగించడం పట్ల అనేక అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపైనే భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెండర్ విధానాన్ని కూటమి ప్రభుత్వం పునః సమీక్షించాలని భక్తులు, హిందూధార్మిక సంస్థలు కోరుతున్నాయి.


ఆలయానికి రూ. 76 లక్షలు నష్టం

తలనీలాల ఆలయ ఆదాయం ఈ ఏడాది బాగా తగ్గినట్లు అధికారులిచ్చిన గణాంకాలు చెబుతున్నాయి. 2023-24 సంవత్సరంలో రూ.1,77,00,211లకు టెండరు పలికింది. దీన్ని కేవీ ఎంటర్‌ప్రైజస్ చాగలమర్రి వారు దక్కించుకున్నారు. వీరికి 10-1-2024వరకు గడువుండేది. గడువు ముగిసిన తరువాత ఆలయ అధికారులు 11-1-2024నుంచి 10-1-2025వరకు టెండర్లకు పిలిచారు. 8మార్లు ఈటెండర్లు పిలిచారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ ఏడాది మే 9న బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో తలనీలాలకుగాను దాదాపు రూ.76లక్షలు తగ్గించి రూ.1.01కోట్లకు దక్కించుకున్నారు. అది కూడా గతంలో వేలం పాడిన కేవీ ఎంటర్‌ప్రైజస్‌కే తిరిగి అప్పగించారు. సాధారణంగా ఎన్ని నెలలు గడిస్తే, అన్ని నెలలకే, గడిచిన నెలలు తీసేసి, మిగిలిన నెలకులకు మాత్రమే టెండర్లు పిలుస్తారు. ఇక్కడ మాత్రం ఈ ఏడాది జనవరి 11 నుంచి వచ్చే ఏడాది జనవరి 10 వరకు టెండర్లు పిలిచారు. ఇందులో మతలబు ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాదికి కూడా కేవీ ఎంటర్‌ప్రైజెస్‌కే టెండరు అప్పగించడంతో దాదాపు రూ.1.5కోట్లకు పైగా ఆలయం ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారా..?

తలనీలాల టెండర్ల వ్యవహారం పరిశీలిస్తే పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు అర్థమవుతుంది. ఈ-టెండర్లల్లో పాల్గొనని కేవీ ఎంటర్‌ప్రైజస్ బహిరంగ టెండర్లలో మాత్రం పాల్గొంది. గతంలో రూ. 1.77కోట్లకు వేలం దక్కించుకున్న ఈసంస్థ, ఈసంవత్సరం రూ. కోటి ఒక్క వెయ్యికే వేలం దక్కించుకుంది. రూ.76 లక్షల తక్కువకు టెండర్ దక్కించుకోవడంతోనే గోల్‌మాల్ జరిగిందని అనుమానిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే 8మార్లు ఈ-టెండర్లు పెట్టినా ఎవరూ పాల్గొన్నలేదని అధికారులంటున్నారు. మరి బహిరంగ వేలంలో పాల్గొనే వారికి ఎందుకు తలనీలా రేటు తగ్గించి అప్పగించారో అర్థం కాని విషయం. ప్రతి సంవత్సరం ఆలయానికి భక్తుల రాకపెరిగిందే తప్ప తగ్గలేదు. టెండర్ విలువ మాత్రం తగ్గింది. కరోనా సమయంలో కూడా రూ.కోట్లు పలికిన తలనీలాలు ధర, ఇప్పుడు తగ్గడం వెనుక కమీషన్ల కక్కుర్తే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.


వచ్చే ఏడాది టెండర్లు నిర్వహించాలి



ఈ ఏడాది తలనీలాలకు టెండర్లు నిర్వహించి, హెచ్చుపాట టెండర్ దారులకు అప్పగించారు. వచ్చే సంవత్సరం కూడా టెండర్లు లేకుండా అదే సంస్థకు అప్పగించడం ఏమిటి. వచ్చే సంవత్సరాలకు తలనీలా టెండర్ నిర్వహించి, స్వామివారి ఆదాయం పెంచాలి. గడిచిన టెండర్ విధానం పునఃసమీక్షించాలి.

- శరత్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

విచారణ జరపాలి



గతంలో ఎక్కువ పలికిన తలనీలాల ధర ఈసంవత్సరం ఎలా తగ్గింది? ఈ- టెండర్లలో ముందుకురాని వేలం పాట దారులు, బహిరంగ వేలానికి ఎలా ముందుకొచ్చారు? ఈ టెండర్ వ్యవహారంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగింది. కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ జరపాలి.

- హరిప్రసాద్, మంగళి మహాసభనాయకుడు

టెండర్లు రాకపోవడంతోనే ధర తగ్గించాం

తలనీలాల టెండర్లకు 8మార్లు ఈ-టెండర్లు నిర్వహించాం. ఒక్కటికూడా దాఖలు కాలేదు. ఉన్నతాధికారుల అనుమతితో బహిరంగ వేలం నిర్వహించాం. అంతర్జాతీయంగా తలనీలాలకు ధర లేకపోవడంతో ఇక్కడ కూడా తగ్గించాం. ఒక సంవత్సరం పాటు టెండర్ వేయడం వలన ఆలయ అధికారులు పోగుచేసిన తలనీలాలు వారికే ఇచ్చాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకే వచ్చే సంవత్సరం కూడా టెండర్లు వారికే ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చాం.

- ఈఓ శ్రీనివాసరెడ్డి

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్‌బీఐ డీజీఎం దినేష్ గులాటి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సాంకేతికయుగంలో ప్రజలను పట్టి పీడిస్తున్న సైబర్ నేరగాళ్ల పట్ల, డిజిటల్ మోసాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని స్టేట్ ఆఫ్ ఇండియా కర్నూలు జోనల్ డిప్యూటి జనరల్ మేనేజర్ దినేష్ గులాటి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సాయినగర్ ఎస్‌బీఐ కార్యాలయంలో సైబర్‌క్రైం, కస్టమర్ సర్వీస్ కేర్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్‌బీఐ డీజీఎం దినేష్ గులాటి మాట్లాడుతూ ప్రజలను ఎక్కడి నుంచో ఫ్రాడ్, ఫేక్ కాల్స్‌తో వలలో వేసుకుని బాధితుల ఖాతాల్లో నుంచి డబ్బులు నొక్కేస్తు న్న సైబర్ నేరగాళ్ళు, డిజిటల్ మోసగాళ్ళపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఖాతాదారులకు డిజిటల్ మోసాలను నిరో ధించడానికి, కస్టమర్ సర్వీస్‌లను మెరుగుపరిచేందు సైబర్‌భద్రతపై అవగాహన పెంచాలన్నారు. ఓ వైపు పట్టణాలు, నగరాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించిన సైబర్, డిజిటల్ మోసగాళ్లను కట్టడిచేసేందుకు ప్రజలలో అవగాహన, చైతన్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బ్యాంకర్లు, పోలీసులు, టెలికాం మొబైల్ సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతోనే సైబర్, డిజిటల్ మోసాలు, ఫేక్‌కాల్స్, ఫ్రాడ్స్‌ను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రమేష్‌బాబు, ఏజీఎంలు చల్లా కోటిరెడ్డి, మేనేజర్లు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కణేకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెణెకల్లు గ్రామంలో రామాంజి(38) అనే వ్యక్తి మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. విడపనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన రామాంజి 15 ఏళ్ల క్రితం బెణెకల్లు గ్రామానికి చెందిన ఈరమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. కూలీ పని చేసుకుని జీవించే రామాంజి పుట్టింటికి వచ్చిన ఈరమ్మ కోసం సోమవారం రాత్రి గ్రామానికి వచ్చాడు. వారిద్దరి మధ్య చిన్నపాటి తగాదా జరగడంతో రామాంజి మంగళవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ చోరీపై డీఎస్పీ ఆరా

యాడికి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు గ్రామంలో కేబుల్‌వైర్ల చోరీపై మంగళవారం తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు రైతులతో ఆరాతీశారు. కేబుల్‌వైర్లు చోరీ జరిగిన వ్యవసాయ బోరుబావులను ఆయన పరిశీలించారు. వరుసగా చోరీ జరిగిన సంఘటనలపై రైతులనుంచి వివరాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ కేబుల్‌వైర్ల చోరీఐ ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. రైతులు కూడా పోలీసు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. గ్రామస్థులు, పోలీసు సిబ్బందితో కలిసి నాలుగు ప్రత్యేక టీంలను ఏర్పాటుచేస్తున్నామని చోరీలను పూర్తిగా అరికడతామన్నారు. ఆయన వెంట సీఐ ఈరన్న ఉన్నారు.

బోగస్ పట్టా కేసులో వ్యక్తి అరెస్టు

- మాజీ ఎమ్మెల్యే అత్తార్, ఆర్ఐని నిందితులుగా చేర్చిన పోలీసులు

కదిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని సున్నపుగుట్ట తండాలో బోగస్ పట్టా కేసులో సోమ్లానాయక్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... సున్నపుగుట్టతండాలో బోగస్ పట్టాలు చేయించి ఇవ్వాలని సోమ్లానాయక్ నాటి ఆర్ఐ మున్వర్ బాషాను కోరాడు. దీంతో సోమ్లానాయక్‌ను ఆ ఆర్ఐ అప్పటి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా వద్దకు తీసుకెళ్లాడు. ఆ తరువాత బోగస్ పట్టాలు తయారుచేసి ఇచ్చేందుకు రూ.20 లక్షలు ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశాడు. బేరమాడిన తరువాత రూ.11 లక్షలు ఇచ్చేందుకు వారు అంగీకరించారు. దీంతో ఆర్ఐ కొన్ని బోగస్ పట్టాలను తయారు చేసి సోమ్లానాయక్‌కు ఇచ్చాడు. అందులో కొంతమందికి పట్టాలు ఇచ్చారు. ఇంకా 39 పట్టాలను సోమ్లానాయక్ తన వద్దే పెట్టుకున్నాడు. పట్టణంలోని శివాలయం వీధిలో ఉంటున్న పీరునాయక్ 2018లో తనకు, తన చెల్లెలుకు పట్టా ఇప్పించాలని సోమ్లానాయక్‌ను కోరాడు. ఆ మేరకు మొదట రూ.50 వేలు ఇచ్చాడు. దీంతో సోమ్లానాయక్ వారికి పట్టాలు ఇప్పించాడు. మిగిలిన రూ.2.50 లక్షలు ఇవ్వకపోవడంతో సోమ్లానాయక్ ఆ పట్టాలు లాక్కుని దౌర్జన్యం చేశాడని పీరునాయక్ ఈనెల 22న పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానిక వైజంక్షన్ వద్ద మంగళవారం సోమ్లానాయక్‌ను అరెస్టు చేశారు. విచారించగా.. పై విషయాలు వెలుగుచూశాయి. సోమ్లానాయక్‌ను కోర్టు ముందు హాజరు పరచగా, రిమాండ్ విధించారు. ఈ కేసులో ఆర్ఐ మున్వర్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాను కూడా నిందితులుగా చేర్చినట్లు సీఐ తెలిపారు.

జిల్లా రగ్బీ బాలబాలికల జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా రగ్బీ అండర్-12 బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. మంగళవారం ఎంపిక చేసిన జట్ల వివరాలను రగ్బీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ సంపత్‌కుమార్ ప్రకటించారు. ఎంపికైన బాలుర జట్టులో...యువన్, రుద్రమనాయుడు, శివసాయి, మానస్, ప్రణీత్, అభిరామ్ చరణ్, జి హర్షవర్ధన్, బషీర్, సంతోష్ నాయక్, సూర్య, రేవంత్‌నాయక్, ఎస్ హర్షవర్ధన్‌లు ఉన్నారు. బాలికల జట్టులో...ఆద్య, గీష్మణి, చరిత, జ్ఞానదీపిక, గ్రేసీ, అమృత, సాహితి, సోనియా, భవ్యశ్రీ, యశ్విత, గౌతమి ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు నెల్లూరు జిల్లా కావలిలో డిసెంబరు 1వతేదీ నుంచి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మురళీమోహన్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఆపరేషన్ డైరెక్టర్ రాజశేఖర్, కోచ్‌లు అలేఖ్య, లక్ష్మి, పీడీ కేశవమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.




ఎంపికైన జిల్లా రగ్బీ అండర్-12 బాలబాలికల జట్లు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

త్రైలింగస్వామి (జయంతి)



త్రైలింగస్వామి 1607 నవంబరు 27న విజయనగరం జిల్లా పూస పాటిరేగ మండలం కుమిలి గ్రామంలో జన్మించారు. అసలు పేరు శివరాముడు. స్వామి గణ పతిగా పేరొందారు. హిందూ ధార్మిక యోగిగా గొప్ప శక్తులున్నాయని ప్రతీతి. (త్రైలంగ స్వామి, తెలంగ్ స్వామిగా పేరొందారు) అతీంద్రియ శక్తి కారణంగా వారణాసిలో ఆయన 280 సంవత్సరాలు జీవించారని భక్తులు విశ్వసిస్తారు. రామకృష్ణ పరమహంస ఆయనను 'వారణాసిలో నడిచే శివుడి'గా స్తుతించారు. 'ది వాకింగ్ శివ' పేరిట స్వామిజీ బయోగ్రఫీని బిరుదురాజు రామరాజు వెలు వరించారు. ప్రత్యేకించి బెంగాల్‌లో చిరస్మరణీయుడిగా నిలిచారు. ఆయనకు ప్రపంచవ్యాప్తంగా భక్తులున్నారు. గంగానదీతీరంలో 1887 డిసెంబరు 26న స్వామిజీ పరమపదించగా గంగానదిలో సలిలసమాధి (సలిలం అంటే నీరు) చేశారు.

ఉస్తాద్ సుల్తాన్ ఖాన్ (వర్ధంతి)



సారంగి వాద్యసంగీత కళాకారుడు పద్మభూషణ్ గ్రహీత ఉస్తాద్ సుల్తాన్ ఖాన్ 1905 ఏప్రిల్ 15న రాజస్థాన్ రాష్ట్రం సికార్ జిల్లాలో జన్మించారు. సికార్ ఘరానాకు చెందిన వీరు శాస్త్రీయ గాయనంలోనూ దిట్ట. 'తబలా బీట్ సైన్స్' అనే ఇండియన్ ఫ్యూజన్ గ్రూప్ సంస్థాపక సభ్యులు. తండ్రి ఉస్తాద్ గులాబ్ ఖాన్ నుంచి సారంగి నేర్చుకున్నారు. 20వ ఏట గుజరాత్‌లో ఆలిండియా రేడియో కళాకారుడిగా సేవలందించారు. పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ, గోల్డ్ మెడలిస్ట్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2011 నవంబరు 27న ముంబైలో కన్నుమూశారు.

ఓల్గా (పుట్టిన రోజు)



కలం పేరు 'ఓల్గా'తో పేరొందిన పోపూరి లలిత కుమారి ప్రముఖ తెలుగు రచయిత్రి. 1950 నవం బరు 27న గుంటూరులో జన్మిం చారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ, సాహిత్యరంగపు చర్చల్లో స్త్రీవాద దృక్పథాన్ని ప్రవేశపెట్టిన రచయిత్రిగా ఆమెను గుర్తిస్తారు. ఓల్గా కథలు, నవలలు, పద్యాలు, మహిళా సాహిత్యం వీటిలో ప్రముఖమైనవి. తెనాలిలోని వీఎస్ ఆర్ తెలుగు కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేశారు. సినీరంగంలో ఉషాకిరణ్ సంస్థకు కథా రచయిత్రిగా పని చేసి మూడు చిత్రాలను నిర్మించారు. ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు పొందారు. 12 రచనలను, ఆమె కథల ఆంగ్ల అనువాదాలను 'అమె రికన్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్' అందుబాటులో ఉంచారు. 'విముక్త' కథల సంపుటికి ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ప్రస్తుతం అస్మితలో జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

రాజ్యాంగంతో అన్నివర్గాలకు అవకాశాలు



బంగారపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు



ఆనేకల్‌లో రాజ్యాంగ దినోత్సవం ప్రారంభంలో ప్రముఖులు

▸▸ ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

బంగారపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుల మత బేధభావాల తారతమ్యాలకు అవకాశం లేకుండా రాజ్యాంగం రూపొందించబడిందని ఎమ్మెల్యే నారాయణ స్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కేసీ రెడ్డి కళాశాలలో, అంబడ్కేర్ ఉద్యానవనంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచం మెచ్చేలా రాజ్యాంగం రూపొందించిన ఘనత అంబేద్కర్‌కే దక్కిందన్నారు. పురసభ అధ్యక్షుడు గోవింద, గ్యారెంటీ సమితి అధ్యక్షుడు పార్థ సారథి, తహసీల్దారు వెంకటేశప్ప, ఈఓ రవికుమార్, బీఈఓ గురుమూర్తి, సత్యనారాయణ, తోటలశాఖ జాయింట్ డైరెక్టర్ శివారెడ్డి, వ్యవసాయ అధికారి ప్రతిభా, సీడీపీఓ మునిరాజు, పురసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దళిత సమాజసేన ఆధ్వర్యంలో...

దేశ ప్రజాప్రభుత్వ వ్యవస్థలో గొప్ప విశిష్టతగా నిలిచేలా రాజ్యాంగ ముసాయిదాపై భారత రాజ్యాంగ కమిటీ సభ్యులు 1949 నవంబరు 16న సంతకాలు చేశారని దళిత సమాజసేన సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1950 జనవరి 26న రాజ్యాంగంలో అమలులోకి రావడంతో గణతంత్ర దినోత్సవంగా ఆచరిస్తున్నామన్నారు. రాజ్యాంగ రచన కమిటీలో కృష్ణస్వామి అయ్యర్, గోపాలస్వామి అయ్యంగార్, కేఎం ముల్కి వంటి సమర్థవంతులు సభ్యులుగా ఉండేవారని అయినా కమిటీ అధ్యక్షుడిగా అంబేడ్కర్ కావడానికిఅపార జ్ఞానార్జన, సమర్థతయే కారణమని గుర్తు చేశారు. దాదాపు రెండున్నరేళ్లపాటు శ్రమించి రూపొందించి ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగంగా తీర్చిదిద్దారన్నారు. 1979లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నవంబరు 26ను జాతీయ న్యాయ దినోత్సవంగా ఆచరించేలా ప్రకటించారన్నారు. ఆ మేరకు ఏటా జాతీయ న్యాయదినోత్సవాన్ని ఆచరిస్తున్నారన్నారు. రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు హక్కులు, సంక్షేమాలు అందేలా పాలకులు వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో గౌతమ్, తాలూకా అధ్యక్షుడు నాగేశ్, అయ్యప్ప, ఆటో కర్ణ, అమరేశ్, రాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆనేకల్‌లో...

దొమ్మసంద్ర: ఆనేకల్ పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో చిన్మయ సేవా సంస్థ చందాపుర, నెహ్రూ యువకేంద్రం, రాష్ట్ర యువజనులశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. బెంగళూరు దక్షిణ ఉప విభాగాధికారి అపూర్వ బిదరి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులకు రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ చిన్నప్ప చిక్కహాగడె అధ్యక్షత వహించారు. రాజ్యాంగ ప్రాధాన్యతను వివరించారు. నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర డైరెక్టర్ అశోక్‌కుమార్ దాస్, రాష్ట్ర యువజనుల సేవ క్రీడాశాఖ సహాయక డైరెక్టర్ శశికళ, విద్యానిపుణులు మునిరాజు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, పీయూ కళాశాల ప్రిన్సిపాల్ కవితా గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఆనేకల్ తాలూకా వ్యాప్తంగా పలు చోట్ల రాజ్యాంగా దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి.

కన్నడలో తిరుగులేని సాహితీవేత్త విద్యాశంకర్



సాహితీవేత్తలకు విద్యాశంకర పురస్కారాలతో సన్మానం

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్య పురోగతిలో ఎంతో మంది ప్రముఖుల సాధనలు ఉన్నాయని వారిలో తిరుగులేని సాహితీవేత్త డాక్టర్ ఎస్ విద్యాశంకర్ అని హంపి కన్నడ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ డీబీ పరమశివమూర్తి అభిప్రాయపడ్డారు. విద్యాశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహిత్య సేవలో సాధకులకు ఏటా పురస్కారాలతో ప్రదానం చేసే తరహాలోనే ఇరువురి ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో పరమశివమూర్తి మాట్లాడుతూ గ్రంథాల రచన పరిశోధనలో డాక్టర్ ఎస్ విద్యాశంకర్ ఎన్నో రికార్డులు నెలకొల్పారన్నారు. కన్నడ విద్వాంసులలో ఆయన తిరుగులేని వ్యక్తి అన్నారు. లోతైన అధ్యయనం, శ్రమ ద్వారా చరిత్రలో నిలిచిపోయేలాంటి రచనలు ఆయనకే సొంతమన్నారు. వీరశైవ సాహిత్య చరిత్ర నాలుగు సంపుటాలను రచించారన్నారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో వీరశైవ పురాణాలపై పీహెచ్‌డీ చేసిన తొలి వ్యక్తి అన్నారు. నిడుమామిడి పీఠాధిపతి వీరభద్ర చన్నమల్లస్వామి మాట్లాడుతూ సాహిత్యంలో నిజమైన పరిశోధకులకు గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవలికాలంలో పురస్కారాలు దారి తప్పేలా పరిగణించబడుతున్నాయని వాటిని సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యాశంకర్ గౌరవ ప్రశస్తిని సాహిత్య పరిశోధకులు డాక్టర్ బీఎస్ స్వామికి అందించారు. రూ.30వేల నగదు, ప్రశంసాపత్రంతో సత్కరించారు. తాళపత్ర గ్రంథాల రక్షణ, సాహిత్య పరిశోధకులు అశోక్ దొమ్మలూరుకు విద్యాశంకర పురస్కారాన్ని, రూ.15వేల నగదును అందించారు. సాహిత్య అకాడమీ సభ్యుడిగా డి లిటరేచర్ సాధించిన డాక్టర్ కా వెం శ్రీనివాసమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రుద్రేశ్ అదరంగి, ఉపాధ్యక్షుడు నాగరత్న, కోశాధికారి ప్రియదర్శినితోపాటు పలువురు పాల్గొన్నారు.

బెంగళూరు ఓ నగరం కాదు...
ఎంతోమందికి జీవనాడి

▸▸ యాక్టివ్ వేర్ బ్రాండ్ కో ఫౌండర్ ఉజ్వల్ భావోద్వేగ పోస్ట్

బెంగళూరు, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఉద్యానగరి బెంగళూరు కేవలం ఒక నగరం మాత్రమే కాదని ఎంతోమంది ఉద్యోగ వేటలో వచ్చేవారికి జీవనాడిగా ఉందని యాక్టివ్ వేర్ బ్రాండ్ జైమ్రాట్ కో ఫౌండర్ ఉజ్వల్ ఆస్థాన భావోద్వేగంతో చేసిన పోస్టింగ్ భారీగా వైరల్ అయ్యింది. ఉజ్వల్ ఇటీవల బెంగళూరును వీడి పూనెలో నివసించాలని నిర్ణయించారు. 14ఏళ్లపాటు జీవనం సాగించిన బెంగళూరును వీడుతున్నట్టు సోషల్‌మీడియాలో భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. అందులోనూ బెంగళూరు తన జీవనాన్ని ఏ విధంగా రూపొందించింది, తొలి ఉద్యోగం, పారిశ్రామిక అవకాశాలు, వృత్తిపరమైన నెట్‌వర్క్ ఏ విధంగా సాగిందనేది సవివరంగా వివరించారు. బెంగళూరులో ఆహ్లాదకరమైన వాతావరణం, మనసుకు ఆకట్టుకునేలాంటి కాఫీ సంస్కృతి, అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ పురోగతి వంటి సంతృప్తి లభించిందన్నారు. 14ఏళ్లపాటు నా జీవితంలో అన్ని మంచివే జరిగాయని, తొలి ఉద్యోగం, తొలి విదేశీ పర్యటన, జీవిత భాగస్వామి, రెండు విజయవంతమైన వ్యవహారాలు, ఆర్థిక సాయం, స్టార్టప్ స్వాధీనం, ఉత్తమ స్నేహితులు లభించారన్నారు. తాను బెంగళూరుతో సంబంధం లేని వ్యక్తి అని ఒకరోజు కూడా అనిపించలేదన్నారు. నగరంలో బీఎంటీసీ, ఆటో, క్యాబ్‌లలోనే సుదీర్ఘకాలం ప్రయాణించానని రాసుకున్నారు. నగరంలో లోతైన సంబంధాలు ఉన్నా తన భవిష్యత్తు పూనెలో ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ఉజ్వల్ పోస్టింగ్ సర్వత్రా వైరల్ అయ్యింది. మరోవైపు బెంగళూరును పొగుడుతూ రాసుకున్న అంశాలను పోలుస్తూ ఇటీవల కొందరు యువతులు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నెటిజన్‌లు మండిపడ్డారు.

అతనెవరు... మమ్మల్ని కొన్నారా..

▸▸ సీపీ యోగేశ్వర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన జేడీఎస్ ఎమ్మెల్యే

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చన్నపట్టణ ఎమ్మెల్యేగా గెలిచిన ఉత్సాహంలో సీపీ యోగేశ్వర్ మాట్లాడుతున్నారని జేడీఎస్ ఎమ్మెల్యే శారదా పూర్యానాయక్ తిరగబడ్డారు. శివమొగ్గలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అతనెవరు.. మమ్మల్ని కొన్నారా... ఆయనను నమ్ముకుని మేం గెలవలేదన్నారు. అతడి సలహాలతో రాజకీయాలు చేస్తున్నామా..? అంటూ విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీ యోగేశ్వర్ మాకు ఆపరేషన్ హస్త టాస్క్ ఇస్తే జేడీఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌కు వచ్చేలా చేర్చుకుంటామన్న వ్యాఖ్యలపై శారదా తిప్పికొట్టారు. ఎమ్మెల్యేగా గౌరవంగా వ్యవహరించడం నేర్చుకోవాలన్నారు. ఆయనకు అటువంటి వ్యవహారాలే అలవాటన్నారు. ఎక్కడికి వెళ్లినా ఇదే తంతు అనేలా ఉన్నారన్నారు. అహం ప్రతి చోటా చూపరాదన్నారు. జేడీఎస్‌లో ఒకరిద్దరికి ముఖ్యనేతలతో వ్యక్తిగత విబేధాలు ఉండవచ్చునని అంతమాత్రాన పార్టీ వీడరన్నారు. మధు బంగారప్ప జేడీఎస్ నుంచి వెళ్లినవారేనని, అందరినీ లాగేసుకొస్తామనడం తప్పు అన్నారు.

నగరంలో ప్రపంచ జూనియర్ హేబాల్ చాంపియన్‌షిప్

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బిలియర్డ్స్ అసోసియేషన్ తొలిసారిగా నగరంలో ప్రపంచస్థాయిలో జూనియర్ హేబాల్ చాంపియన్‌షిప్ పోటీలను మంగళవారం లాంఛనంగా ప్రారంభించింది. వరల్డ్‌పూల్ బిలియర్డ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కట్ జోర్గన్, రాష్ట్ర స్నూకర్ క్రీడాకారుడు ఐహెచ్ మనుదేవ్, వరల్డ్ బిలియార్డ్ చాంపియన్ భాస్కర్, హేబాల్ క్రీడాకారుడు లక్స్ బిలియర్డ్స్ ఫౌండర్ ఉపేంద్ర థాపాసింగ్ ముఖ్యులుగా పాల్గొన్నారు. బాలుర జూనియర్స్ విభాగంలో మయాంక్ కార్తీక్, తమిళనాడునుంచి లక్ష్మీనారాయణన్, బాలికల విభాగంలో నటాషా చేతన్ (కర్ణాటక), శృతి (తమిళనాడు)లు జాతీయస్థాయిలో పోటీ పడనున్నారు. 40మంది బాలురు, 13మంది బాలికలు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పేదలకు న్యాయం దక్కేలా చేయాలి



కన్నడ రాజ్యోత్సవంలో రాజణ్ణ తదితరులు

విజయపుర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని పేదలు, నిర్భాగ్యులకు న్యాయం దక్కేలా చేయాలని గ్యారెంటీ పథకాల దేవనహళ్ళి తాలూకా అధ్యక్షుడు రాజణ్ణ అభిప్రాయపడ్డారు. విజయపుర హోబళిలోని సాయి గ్రూప్ విద్యాసంస్థలు, నారాయణపుర గ్రామస్థుల సహకారంతో సాయి లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కన్నడ రాజ్యోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాధికార అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నా కన్నడ హృదయభాషగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే ఇతరులకు నేర్పించాలన్నారు. గూడ్లు ముద్దేనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు మురళీధర్ మాట్లాడుతూ ఇటీవల కొత్తగా విడుదలైన రూ.20, 50, 100, 200, 2వేల నోట్ల కరెన్సీపై కర్ణాటక చరిత్రకు సంబంధించిన చిత్రాలు ఉన్నాయన్నారు. సాయి గ్రూప్ విద్యాసంస్థల అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా 8 జ్ఞానపీఠ పురస్కారాలు దక్కిన ఘనత కన్నడకే దక్కిందన్నారు. డివిజి, కువెంపు, దరా బెంద్రె, పుతిన వంటి మహనీయులు కన్నడకు ఎంతో ఘనత తెచ్చారన్నారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్ బాలకృష్ణ, బిజవార గ్రామపంచాయతీ అధ్యక్షుడు మహదేవ్, హారోహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు సుమ మంజునాథ్ పాల్గొన్నారు.

రియల్.. ధమాల్..!

- భారీగా పడిపోయిన రియల్ వ్యాపారం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు
- గణనీయంగా తగ్గిపోయిన రిజిస్ట్రేషన్లు



నార్పల వద్ద వేసిన వెంచరు



తాడిపత్రి వద్ద భూమిని చదును చేసిన దృశ్యం

తాడిపత్రి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీగా పడిపోవడతో వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో ఎన్నికల ముందు నుంచే రియల్‌ఎస్టేట్ వ్యాపారం తగ్గుముఖం పట్టింది. అయితే ఎన్నికల అనంతరం పుంజుకుంటుందని వ్యాపారులు ఆశించారు. కానీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కూడా రియల్ వ్యాపారంలో ప్రగతి లేకపోవడంతో వ్యాపారులు డీలా పడ్డారు. అడ్వాన్స్‌తో వ్యాపారాలు ప్రారంభించిన కొందరు త్వరగా అమ్మి సొమ్ము చేసుకోవాలని చూశారు. కానీ వ్యాపారం భారీగా పడిపోవడంతో కొన్న స్థలాన్ని విడిచి పెట్టుకోలేక అప్పులు తెచ్చి వాటిని రిజిస్టర్లు చేయించుకుంటున్నారు. ఇప్పటికే రూ.2లక్షలు విలువ చేసే సెంటు ధర దాదాపు రూ.8లక్షల వరకు చేరింది. దీంతో వాటిని కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతుండటం, పాట్లు అమ్ముడుకాకపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ రియల్ వ్యాపారం చేస్తున్నారు. వీటిలో కొనేవారు, అమ్మేవారి కన్నా వ్యాపారులు, బ్రోకర్లే ఎక్కువకావడంతో రియల్ ఎస్టేట్ భారీగా పడిపోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. ఇప్పటికే కొందరు అడ్వాన్స్‌లు చెల్లించి పూర్తి మొత్తం చెల్లించలేక వదులుకున్న పరిస్థితులు కూడా ఉన్నాయి.

గతంలో 100 రిజిస్ట్రేషన్లు... ప్రస్తుతం 30లోపే

2015 నుంచి 2023వరకు ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. అప్పట్లో వ్యాపారాలు బాగా ఉండేవి. ప్రస్తుతం దాదాపు ఏడాది నుంచి రియల్‌ఎస్టేట్ పడిపోవడంతో రోజుకు 20నుంచి 30లోపే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అవికూడా గతంలో వ్యాపారంచేసి సమయం కోరుకున్నవి, ప్రస్తుతం పట్టణంలో అక్కడక్కడ అవసరాల నిమిత్తం తీసుకున్న వాటికి మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

ఆర్థికంగా దెబ్బతిన్నాం: రమణ, రియల్ ఎస్టేట్‌వ్యాపారి, తాడిపత్రి



గత వైసీపీ ప్రభుత్వంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం స్తబ్ధుగా నడిచింది. కనీసం కూటమి ప్రభుత్వం వచ్చాక అయిన వ్యాపారం పుంజుకుంటుందని అనుకున్నా. కానీ ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడిచినా పెద్దగా మార్పు లేకపోవడంతో ఆర్థికంగా దెబ్బ తిన్నా. భవిష్యత్తులో కూడా ఇలాగే రియల్‌ఎస్టేట్ ఉంటే మాత్రం ప్రత్యామ్నాయం చూసుకోక తప్పదు.

ఎప్పుడూ ఇలా లేదు: నాయుడు, తాడిపత్రి

15ఏళ్ల నుంచి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా. ఎప్పుడూ ఇంత స్తబ్ధుగా లేదు. ఏడాది నుంచి మాత్రమే ఇలా ఉంది. అప్పులు తెచ్చి వ్యాపారం చేయాలంటే భయంగా ఉంది. వ్యాపారం సరిగా లేకపోవడంతో ఆదాయం తగ్గింది. నూతన ప్రభుత్వంలో కూడా వ్యాపారం పుంజుకోకపోవడం ఆశ్చర్యంగా ఉంది. భూముల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యాపారం బాగా తగ్గిందని అనుకుంటున్నా. పరిస్థితి ఇలాగే కొనసాగితే మాత్రం రియల్‌ఎస్టేట్ వ్యాపారం విడిచిపెట్టాల్సిందే.

వెలవెలబోతున్న వెంచర్లు

నార్పల: మండలంలో స్థలాలు కొనేవారు లేక వెంచర్లు వెలవెలబోతున్నాయి. మండలంలో పరిశ్రమలు, జాతీయ రహదారులు లేకపోయిన కూడా రియల్ వ్యాపారం బాగా జరిగేది. వ్యవసాయ భూములను చదను చేసి వెంచర్లను ఏర్పాటు చేసుకుని, తక్కువ సమయంలోనే వాటిని విక్రయించి బాగా లాభాలు గడించేవారు. ఇలా కొందరు నెలలోనే రూ.కోటి వరకు సంపాదించిన సంఘటనలు ఉన్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగిన రోజుల్లో బ్రోకర్లే కోట్లకు పడగలెత్తారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయకపోవడం, రిజిస్ట్రేషన్ల ధరలు పెంచడం, వెంచర్లు వేసిన ప్రతిచోట కొందరు ప్రజాప్రతినిధులు వాటాలు కావాలని డిమాండ్ చేయడం తదితర సమస్యలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా దెబ్బతిందని వ్యాపారులు చర్చించుకుంటున్నారు. టీడీపీ హయాంలో అమరావతి హైవే వస్తుందని ప్రకటించడంతో బుక్కరాయసముద్రం మండలంలోని పలు గ్రామాలు, నార్పల మండలంలోని నడిమిదొడ్డి, గడ్డంనాగేపల్లి, బొమ్మలాట పల్లి, సంజీవపురం, తదితర గ్రామాల వద్ద వందల ఎకరాలను వ్యాపారస్థులు ముందుగానే కొనుగోలు చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే అమరావతి హైవేను రద్దు చేసింది. దీంతో వాటిని వ్యవసాయానికి వాడుకోలేక, తక్కువ ధరలకు అమ్ముకోలేక అలాగే వదిలేశారు. మరికొంత మంది రియల్టర్లు ఎప్పుడూ వ్యాపారం పుంజుకుంటుందా అని ఎదురుచూస్తున్నారు.

ఒకే రియల్టర్‌కు రూ. 50 కోట్లు అప్పు

నార్పలకు చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారికి మొదట్లో వ్యాపారం బాగా సాగడంతో కోట్లలో డబ్బులు సంపాదించాడు. ఈక్రమంలోనే ఈయన ఎక్కడపడితే అక్కడ భూములు కొనుగోలు చేశాడు. ప్రస్తుతం రియల్ వ్యాపారం పడిపోవడంతో ఆస్తులను అమ్ముకొని దాదాపు రూ.50కోట్లు అప్పులు చేసినట్లు సమాచారం. త్వరలోనే ఐపీ కూడా పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

నరేగా పనుల పరిశీలన



పాఠశాల మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శిడ్లఘట్ట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని కుంభిగానహళ్ళి, చీమంగల గ్రామపంచాయతీలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ప్రకాశ్ జిటి నిట్టాలి పరిశీలించారు. కుంభిగానహళ్ళి పంచాయతీ పరిధిలో సీసీ డ్రైనేజీ, మాదిరి అంగన్‌వాడీ కేంద్రం, శౌచాలయం నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేగా సహాయక డైరెక్టర్ చంద్రప్ప, చీమం గల పీడీఓ తన్వీర్ అహ్మద్, కుంభిగానహళ్ళి పీడీఓ ప్రశాంత్, జిల్లా పంచాయతీ ఎడీపీసీ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటి స్వామికి ప్రాకారోత్సవం



గుంతకల్లు, నవంబరు26(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస చివరి మంగళవారం కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి ప్రాకారోత్సవాన్ని కన్నుల పండువ గా నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్టుకు అభిషేకాలు, ప్రత్యేకాలంకారాలు చేశారు. రాత్రి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పుష్ప, ఆభరణాలతో అలంకరించి పల్లకీలో ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

In the Court of the Principal District Judge, Kadapa.
MVOP No.168/2024
Avula Radhika and 3 Others ...Petitioner
Vs
Shri Naveen Transports, R/o D.No. 10/15, Kathalipalya, 17th Main, 6th Block, Koramangala, Bangalore, Karnataka -560095 - Respondent No.2
Summons to R2 U/o0 R1 and 5 CPC
పై తెలిపిన పిటిషనర్లు రోడ్డు ప్రమాదంలో 1వ పిటిషనర్‌యొక్క భర్త చనిపోయినందుకుగాను 2వ ప్రతివాదియైన మరియు మిగిలిన ప్రతివాదులపైన నష్ట పరిహారము కోరి పైకేసు దాఖలు చేసియున్నారు. 2వ ప్రతివాదియైన నీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో నీవు స్వయానగాని మరియు వకీలుద్వారా గాని 16.12.2024వతేదీన ఉ॥ 10.30గం.లకు హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమున తీర్మానించబడును.
//By Order of the Court//
K. KRISHNAIAH
Advocate, Kadapa. Cell : 94409 94702



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.33	1596.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,359	506
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,039	10,461
నీటి నిల్వ (టీఎంసీలు)	95.31	16.85

మరో బాలింత మృతి

బళ్లారి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రి (గోషా ఆసుపత్రి)లో ముష్కాన్(19)అనే మరో బాలింత కన్నుమూశారు. ఇంతకముందు, లలిత, నందిని, రోజా అనే బాలింతలు కన్నుమూశారు. సోమవారం రాత్రి ముష్కాన్ (19) అనే బాలింత కూడా మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ముష్కాన్ ఈనెల 7న బళ్లారి జిల్లా ఆసుపత్రికి కాన్పుకు వచ్చారు కాన్పు తరువాత ఆరోగ్యపరిస్థితి విషయంగా మారడంతో జిల్లా ఆసుపత్రి నుంచి విమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. అక్కడ వైద్యం సరిగా అందడం లేదనే కారణంతో పక్కనే ఉన్న బళ్లారి సిటీ ఆసుపత్రి (బీ.సీ.హెచ్)కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ సోమవారం రాత్రి కన్నుమూసినట్లు జిల్లా శస్త్రచికిత్సవైద్యులు ప్రకటించారు. గోషా అసుపత్రిలో బాలింతల వరుస మరణాలపై ప్రజల్లో ఆందోళన మొదలయ్యింది. గోషా ఆసుపత్రి కి చాలా మంది పేద, మధ్యతరగతి గర్భిణీలే కాన్పుకు వస్తుంటారు. ఏపీ సరిహద్దులో ఉండడంతో అనంతపురం, కర్నూలు జిల్లాలోని సరిహద్దు తాలూకాలతో పాటు బళ్లారి, రాయచూరు, చిత్రదుర్గం జిల్లాల నుంచి కూడా కాన్పుకు వస్తుంటారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింతలు మృతిచెందారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఇటీవల 10 మంది బాలింతలు అస్వస్థతకు గురి కాగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు ఇప్పటికీ వెంటిలేటర్ పైనే ఉన్నారు. ఇద్దరు కోలుకుంటున్నారు. ఈఘటన జరిగిన వెంటనే ప్రభుత్వ వైద్యులు వాస్తవాన్ని దాచిపెట్టారు. మూడు రోజుల తరువాత వాస్తవం వెలుగు చూసింది. వైద్యుల నిర్లక్ష్యంపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు అందోళన చేపట్టాయి. బెంగళూరు నుంచి విచారణకు త్రిసభ్య కమిటీ వచ్చింది. ఘటనపై వైద్యులతో ఆరా తీశారు. కాన్పుల గదిలో కొన్ని వస్తువులను ఫోరెనిక్స్ ల్యాబ్‌కు తరలించారు. అయితే మరో బాలింత మృతితో ఆందోళన నెలకొంది.

మృత్యువులోనూ వీడని బంధం

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అన్యోన్య దంపతులుగా పేరొందిన వారు మృత్యువులోనూ వారి బంధం వీడలేదు. గంటలవ్యవధిలోనే ఒకరి తర్వాత మరొకరు గుండెపోటుతో కన్నుమూశారు. దావణగెరె జిల్లా చన్నగిరి తాలూకా దేవరహళ్ళి గ్రామంలో విషాద సంఘటన చోటు చేసుకుంది. సోమవారం గ్రామానికి చెందిన కస్తూరి రంగప్ప (65) చౌకడిపోనుంచి బియ్యం తీసుకొచ్చేందుకు వెళ్లారు. ఇదే సమయంలోనే గుండెపోటుకు గురై కుప్పకూలారు. వెంటనే స్థానికులు అతడిని చన్నగిరి ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక మృతి చెందాడు. ఆసుపత్రికి వెళ్లిన బంధువులు విషయాన్ని కసూర్తి రంగప్ప భార్య జయమ్మ (61)కు ఫోన్ చేసి తెలిపారు. తీవ్ర ఆవేదనకు గురైన ఆమె కూడా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. స్థానికులు గమనించేసరికి మృతి చెందారు. మృత్యువులోనూ వారి బంధం వీడలేదని పలువురు అభిప్రాయపడ్డారు.

పాడి అభివృద్ధిలో కురియన్ సేవలు మరువలేనివి

● రాబకోవి మిల్క్ యూనియన్ మేనేజర్ ఎర్రిస్వామి రెడ్డి

బళ్లారి నవంబరు 26(ఆంధ్రజ్యోతి):ప్రపంచంలో పాల ఉత్పత్తిలో భారత దేశం రెండోస్థానంలో ఉండడానికి, పాడి అభివృద్ధికి డాక్టర్ వర్గీస్ కురియన్ సేవలు ఎనలేనివని, అందుకే ఆయనను పాల విప్లవ పితామహుడు అని పిలుస్తారని రాబకోవి(రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగరం) జిల్లా మిల్క్ యూనియల్ మేనేజర్ ఎర్రిస్వామిరెడ్డి అన్నారు. రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగరం జిల్లా మిల్క్ యూనియన్ తరపున మంగళవారం బాలికల పిల్లల సమాఖ్యలో క్షీరక్రాంతి పద్మభూషణ్ తంగ్రి డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రీయ మిల్క్ డే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరంలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శాంతి దామ ప్రాంగణంలోని చిల్డ్రన్ హాల్ అమూల్ డైయిరీ వ్యవస్థాపకుడు, భారతదేశంలో ఆపరేషన్ ఫ్లడ్(మిల్క్ రెవిల్యూషన్) పేరుతోప్రపంచంలోనే అతి పెద్ద డెయిరీ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి దేశంగా మార్చడానికి బాధ్యత వహించిన డాక్టర్ వర్గీస్ కురియన్ జాతీయ పాల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు.

రాబకోవి మిల్క్ యూనియన్ డిప్యూటీ మేనేజర్ మల్లికార్జున మాట్లాడుతూ నందిని నిత్య జీవితంలో కల్తీలే కుండా పాల ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పద్మభూషణ్, పద్మశ్రీ,పద్మ విభూషన్ అవార్డు గ్రహీత డాక్టర్ వర్గీస్ కురియన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలు,పాల ఉత్పత్తుల ప్రాధాన్యత,సమతుల ఆహారంలో పోషకాలు,ఆరోగ్యానికి వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో రాబకోవి మిల్క్ యూనియర్ మార్కెంటింగ్ కాంట్రాక్ట్ కన్సల్టెంట్ మంజునాథ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది నాగవేణి,పార్వతి,యూనియన్ సిబ్బంది వెంకటరత్నబాబు, జగదీశ్,గోవిందరాజులు, మల్లికార్జున, వీరేశ్,సరోజ, లోహిత్‌కుమార్, కార్యక్రమంలో విద్యార్థులకు నందిని బాదం పంపిణీ చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎర్రిస్వామి రెడ్డి

రైతు సమస్యలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప



అధికారులతో వాగ్వాదానికి దిగిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

సిరుగుప్ప, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మండిపడ్డారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, పంట నష్ట పరిహారం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆయన నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ తాలుకాలో పది వేల ఎకరాలలో పంట నష్టం జరిగితే రెవెన్యూ అధికారులు కేవలం 80 ఎకరాలు మాత్రమే నష్టం జరిగిందని నివేదిక పంపడం సిగ్గుచేటన్నారు. వరికోతలు ప్రారంభమై 20 రోజులు గడిచినా జిల్లా అధికారి వారం రోజుల క్రితమే వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించినా అవి ప్రారంభం కాకపోవడం దారుణమన్నారు. ఎర్రమట్టి దందాను అరికట్టాలన్నారు. తహసీల్దార్ విశ్వనాథ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాటిల్ సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చాడు. .ధర్నాలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, సీనియర్ నాయకులు ధరప్పనాయక, తాలుకా అధ్యక్షులు కుంటనహాల్ మల్లికార్జున స్వామి, నాయకులు మైకేల్ వీరేష, మహాదేవ, కుమారగౌడ, శ్రీనివాస, రైతులు, పాల్గొన్నారు.

దేవదాసీలకు పించన్లు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న దేవదాసీలు

కంప్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వుండే దేవదాసీ మహిళలకు కర్ణాటక ప్రభుత్వం ఎంతో ఘనంగా పించన్లు ఇవ్వాలని జిల్లా కార్యదర్శి స్వామి తెలిపారు. మంగళవారం కంప్లి పట్టణంలో తహసీల్దార్ శివరాజ్ శివపురకు మనవి పత్రం అందించారు. స్వామి మాట్లాడుతూ దేవదాసీ కుటుంబీకులకు కుటుంబ గడవక ఎంతో మంది ఆరుబయట పడ్డారు. ప్రభుత్వం గ్యారెంటీ పథకాల వల్ల వీరికి పించన్లు సక్రమంగా అందకుండా పోతున్నాయి. ప్రభుత్వం వీరికి ఇళ్లు కట్టించాలి. వారి పిల్లలకు విద్యాభ్యాసం కూడా కల్పించాలన్నారు. అలాగే స్వయం ఉపాధి చేసే వారికి రూ.5 లక్షలు రుణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉలిగమ్మ, గౌరమ్మ, ఈరమ్మ, రేణుకమ్మ, మరియమ్మ, గంగమ్మ, దుర్గమ్మ, రేణుక, దేవదాసీ మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ముందుకు రావాలి

కంప్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మనస్పర్థలు వీడి అభివృద్ధికి ముందుకొస్తేనే నిజమైన నాయకుడిగా ప్రజల్లో ఉండిపోతారని విజయనగర కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సిరాజ్ షేక్ తెలిపారు. హోస్పేట పట్టణంలో మంగళవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విజయనగరంకు రూ.130 కోట్లు నిధులు కల్పించింది. నియోజకవర్గ ఎమ్మెల్యే రూ.వంద కోట్లకు మాత్రమే భూమిపూజ చేశారు. ఇంకా రూ.30 కోట్ల నిధులకు ఎలాంటి భూమిపూజ చేయలేదన్నారు. నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకుని నియోజకవర్గంలో అభివృద్ధి బాటలో కొనసాగేలా చూడాలని కోరారు.

కాలుష్య దుష్పరిణామాలపై ర్యాలీ

బళ్లారిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో మంగళవారం ఉదయం మున్సిపల్ మైదానం నుండి మోతీ సర్కిల్ వరకు ఆర్టీవో శ్రీనివాస్, గిరి నేతృత్వంలో ఆర్టీవో అధికారులు విద్యార్థులు నగర వీధుల్లో వాహనం వాహనాల కాలుష్యంపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆర్టీవో శ్రీనివాస్ గిరి మాట్లాడుతూ పాత వాహనాలు కాలుష్యంపై పాత బడ్డ వాహనాలు నగరంలో సంచారంపై దీనికి అధికారులు చర్యలు తీసుకుంటామని అదేవిధంగా ఇంటి సమీపంలోని సమీప స్థలానికి వెళ్లేందుకు సైకిల్ని వాడాలని, బ్యాటరీ వెహికల్స్‌తో కాలుష్యం తగ్గుతుందని ఈ రోజు వాసవి స్కూలు విద్యార్థులు, ఆర్టీవో అధికారులు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవోలు శరణమయ్య, మహమ్మద్ రఫీ, నిజాముద్దీన్, సిబ్బంది, గోపి పాల్గొన్నారు.



కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమృత మహోత్సవాలకు సిద్ధం

బళ్లారి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన బళ్లారిలోని ఆరోగ్య మాత చర్చి అమృత మహోత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలకు సీఎం సిద్దరామయ్య బుధవారం హజరు కానున్నారు. పవిత్రమైన ఈ చర్చికి పురాతనమైన చరిత్ర ఉంది. 1837 నుంచి 1672 వరకూ సుమారు 32 ఏళ్ల పాటు అప్పట్లో మద్రాస్ మస్తాపూర్ రైతు ధ్యాన మిషన్ ను ఐర్లాండ్ కు చెందిన మిషన్ నడిపారు. తరువాత 1949లో ఆ బాగంలోని బళ్లారి, రాయచూరు, కొప్పళ్, కలబురగి, కేంద్రాలుగా క్రైస్తవ ధర్మక్షేత్రం(డియోసెస్) ఏర్పడింది. మద్రాసు క్రైస్తవ విభాగంలో బళ్లారి 1949 మార్చి 10న విభజించబడింది. ఈ విధంగా ఇది ప్రత్యేక పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందింది. అలా ఏర్పడిన బళ్లారి ధర్మక్షేత్రంకు బిషప్ గా జాన్ హెగన్ నియితులయ్యారు. ఇంగ్లాండ్ దేశానికి చెందిన జాన్ హెగన్ తొలి బిషప్ గా పనిచేశారు. చెన్నైకి చెందిన అంబ్రోస్ బిషప్, తరువాత కొడగు వీర్‌రాజ్‌పేటకు చెందిన జోసెఫ్ డిసిల్వా బిషప్ అయ్యారు. తరువాత మంగళూరుకు చందిన హెన్రీ డిసౌజా 16 ఏళ్ల కాలం పాటు బిషప్‌గా కొనసాగారు. అప్పట్లో ఉండే జిల్లాలతో పాటు కొత్తగా ఏర్పడిన విజయనగర జిల్లా కూడా ఈ ధర్మక్షేత్రం పరిధిలో చేరింది. నగరంలోని క్రిస్టియన్ మిషన్‌కు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ మిషన్ అప్పట్లో మద్రాసు ప్రావిన్స్‌లోని మైలాపూర్ ధరామక్ష్యక్షుని ఆధ్వర్యంలో స్థాపించబడింది. ఐర్లాండ్‌కు చెందిన పాట్రిక్ డోయల్ బళ్లారి క్రిస్టియన్ మిషన్‌కు ఉపాధ్యాయుడుగా నియమితులయ్యారు. ఇక్కడ సుమారు 60 కి పైగా పాఠశాలలు, కళాశాలలు, 50 చర్చిలు, ఓ ఆశ్రమం, బుద్ధిమందగించిన వారికి ప్రత్యేక ఆశ్రమాలు, నడుపుతున్నారు. ఆధ్యాత్మికంగా ఎంతో మందికి మానసిక ఉల్లాసం కలిగించి వారికి మానసిక వత్తిడి నుండి కాపాడుతున్నారు అని ఫాదర్ తెలిపారు. సీఎం రాక సందర్భంగా డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి వేదిక తదితర ఏర్పాట్లు పరిశీలించారు.

రాజ్యాంగం ఉద్దేశాన్ని అందరూ తెలుసుకోవాలి

● తోళ్ల పరిశ్రమ సంస్థ అధ్యక్షుడు ముండరగి నాగరాజు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ముండరిగి నాగరాజు

బళ్లారి సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత దేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ ప్రవేశిక ఆశయాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ తోళ్ల పరిశ్రమ అభివృద్ది సంస్థ అధ్యక్షుడు ముండరగి నాగరాజు పేర్కొన్నారు. నగరంలోని నల్లచెరువు మహర్షి వాల్మీకి భవన్‌లో జిల్లాపాలనా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమాన్నిఆయన ప్రారంభించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించి నేటికి 75సంవత్సరాలు అయ్యిందని, రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ప్రొఫెసర్ హొన్నూర్ వలి మాట్లాడుతూ భారతదేశం లౌకికరాజ్యమని, రాజ్యాంగం ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా అందరూ సమానమన్నారు. హామీపథకాల అమలు ప్రాధికార సంస్థ అమలు ప్రాధికార సంస్థ జిల్లా అధ్యక్షుడు చిదానందప్ప, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు మల్లికార్జున, సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మమత, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శివాజీరావు, మహానగర కార్పొరేషన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు ,హాస్టళ్ల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ధర్మగ్రంథం: మాజీ ఎమ్మెల్యే

రాజ్యాంగం ధర్మగ్రంథం లాంటిదని నగర మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. నగర బీజేపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగాన్ని రూపొందించి 75 సంవత్సరాలు అయ్యిందని, ఎందరో పేదలకు న్యాయం చేయడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఈసందర్భంగా విధానపరిషత్ సభ్యుడు యం.సతీశ్, నాయకులు రామలింగప్ప, డా.బి.ఆర్, సుందర్, రూప ప్రధాన కార్యదర్శి హులుగప్ప, యువ మోర్చా రాష్ట్రకార్యదర్శి అడవిస్వామి, కార్పొరేషన్ సభ్యులు శ్రీనివాస్‌మోత్కార్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని ప్రభుత్వ మాజీ మున్సిపల్ అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

స్టాంపుల విడుదల

రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా చారిత్రక బళ్లారి కోట, సండూర్‌లోని పార్వతివ కుమారస్వామి దేవాలయంతో కూడిన శాశ్వత చిత్ర స్టాంపును భారత తపాలా శాఖ విడుదల చేసింది. తపాలా సూపరింటెండెంట్ చిదానంద మాట్లాడుతూ..... బళ్లారి కోటపోస్టాపీసు, సండూర్ పోస్టాఫీసుల్లో ఈ చిత్రమైన స్టాంపులు శాశ్వతంగా వినియోగిస్తామన్నారు. పురావస్తు శాఖకు చెందిన రవీంద్ర, కళాకారుడు ఆర్.ఎల్, జాదవ్ , పోస్టమాస్టర్ రామకృష్ణారెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు సహకరించాలి: డీహెచ్‌ఓ



కార్యక్రమంలోమాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

అంటువ్యాధుల నివారణకు ప్రజలు సహకరించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయ హాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజ్యాంగ పీఠిక పఠన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1949 నవంబరు 26న దేశ వ్రాత పూర్వక రాజ్యాంగానికి మనమందరం కట్టుబడిఉన్నామని, దేశ సమగ్రత అందరీ భద్రత అనే వివక్ష లేకుండా ఆరోగ్య రంగంలో ప్రతి వ్యక్తి సామాజిక హోదాతో సమానంగా ఉండాలన్నారు. జిల్లా ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మరియంబి, జిల్లా క్షయవ్యాధి నిర్మూలన అధికారిణి డాక్టర్ ఇంద్రాణి, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప, జిల్లాఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వరదాసప్పనవర్, బసవరాజు, వెంకటేశ్, రవాణాశాఖ ఇంజనీర్ విజయ్‌కుమార్, జిల్లా హెల్త్ ఇన్స్పెక్టర్ విరూపాక్షప్ప, అసిస్టెంట్ స్టాటికల్ అధికారులు, జిల్లాస్థాయి సలహాదారులు,కన్సల్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు

సిరుగుప్ప: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ రచన వలన భారతదేశంలో న్యాయవ్యవస్థ సుభద్రంగా సాగుతోందని దళిత సంఘం నాయకులు గంగప్ప తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో భవనంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కంప్లి : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అమలు చేసిన సంవిధాన దినోత్సవాన్నికంప్లి తాలుకాలో వివిధ పాఠశాలలో, సత్యనారాయణ పేట ప్రభుత్వ పాఠశాలలో సంభ్రమంగా నిర్వహించుకున్నారు. తాలుకా ఈవో శ్రీకుమార్, మల్లన్నగౌడ, షణ్ముఖప్ప, నరసప్ప, రవీంద్ర కుమార్, బసవరాజు, విరుపాక్షి, డాక్టర్ అరుణ్, లక్ష్మణ, చెన్నప్ప, బీవో శిక్షణ అధికారి సిద్దలింగమూర్తి, మల్లేశప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి



కంప్లిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శివరాజ్‌కుమార్

హోసూరు జోన్



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సరయు

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టరేట్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం అర్థవంతంగా ఆచరించారు. కలెక్టర్ సరయు అధ్యక్షత వహించి అధికారులు, ప్రజలచే ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే ప్రజాస్వామ్య వ్యవస్థలో గొప్పగా నిలిచిందన్నారు. 1949 నవంబరు 26న రాజ్యాంగ ముసాయిదా ఆమోదం పొందిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, జిల్లా కలెక్టర్, ఇంటర్న్యూ అసిస్టెంట్ పుష్ప, జిల్లా కలెక్టర్ కదిరవన్, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ అధికారి రమేశ్ కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు హోసూరులో విద్యుత్ కోత

హోసూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): హోసూరు మిన్‌నగర్ సబ్‌స్టేషన్, సిఫ్‌కాట్ ఫేజ్2 సబ్‌స్టేషన్లలో ఈనెల 27న అవసరమైన విద్యుత్ ఉపకరణాల నిర్వహణ కారణంగా విద్యుత్ కోత ఏర్పడనుంది. బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. హోసూరు మిన్నగర్ సబ్ స్టేషన్, శానసంద్రం, ఓన్నలవాడీ, శానమావు, తొరపల్లి, గొల్లపల్లి, తిరుచ్చిపల్లి, ఓల్డ్ టెంపుల్ హడ్కో, కొత్త బస్టాండు , కామరాజ్ కాలనే, అన్నానగర్, ఎంజీ రోడ్డు, నేతాజీరోడ్డు, సీతారాం నగర్ వాటి చుట్టుపక్కల ప్రాంతాలు, సిఫ్‌కాట్ ఫేజ్ 11, బత్తలపల్లి, పెన్నామటం, ఎలక్ట్రానిక్ ఎస్టేట్, కుముదేపల్లి, మోర్నపల్లి, శామనపల్లి, ఆలూరు, బుక్కసాగరం, అదియమాన్ కళాశాల, కదిరేపల్లి, మారుతీనగర్, పేరండపల్లి, రామచంద్రం, సుండట్టి అంకేపల్లి ప్రాంతాల్లో కోత ఉంటుందని అధికారులు తెలిపారు.

హరిత కుటీరాలపై అవగాహన పెరగాలి

హోసూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హోసూరు పరిసర ప్రాంతాల వాతావరణ పూల సాగుకు అనుకూలంగా ఉండడంతో ఆమేరకు వివిధ రకాల పుష్పాలతోపాటు కూరగాయలు సాగు చేస్తున్నారు. బాగలూరు, బేరికై, రాయకోట, కెలమంగలం, తదితర ప్రాంతాల్లో 2 వేలకు పైగా హరిత కుటీరాలు (గ్రీన్ హౌస్) ఏర్పాటు చేశారు. టమోటాలు, బీన్స్, కీరదోస, మిరపకాయలు వంటి కూరగాయలు పండిస్తున్నారు. నాణ్యమైన కూరగాయల దిగుబడికి అనుకూలంగా ఉంది. రైతులు సాధారణ పొలాల్లో కాకుండా నర్సరీలలో ద్వారా కూరగాయల సాగుకు ఆసక్తి చూపడంతో గ్రీన్‌హౌస్‌ల ఏర్పాటుకు రాయితీలు కల్పిస్తున్నారు. గ్రీన్‌హౌస్ లోపల పంటకు సరిపడా నీరు, ఎరువులు సమకూర్చాల్సి ఉంటుంది. సాధారణ సాగు పద్ధతులతో పోలిస్తే గ్రీన్‌హౌస్‌ల ద్వారా పండించే కూరగాయల నాణ్యత మెరుగ్గా ఉంటుంది. ఇది మరింత లాభదాయకం. ఒకసారి నిర్మించి క్రమం తప్పకుండా నిర్వహిస్తే 20 సంవత్సరాల వరకు ఉంటుంది. ఈ గ్రీన్‌హౌస్ ఫార్మింగ్ చిన్న రైతులు కూడా చేయొచ్చు. పెట్టుబడి కొద్ది నెలల్లోనే తిరిగి రాబట్టే అవకాశాలు ఉంటాయి. గ్రీన్‌హౌస్‌ల ఏర్పాటుకు ఉద్యానవన శాఖ సబ్సిడీలు ఇస్తోంది సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



గ్రీన్‌హౌస్‌లో దుక్కులు ఇలా...



మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

కూరగాయల మార్కెట్ నిర్మాణాల పరిశీలన

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శుద్ధిచేసిన తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల వద్ద శుభ్రత, ప్రయాణీకులకు సీట్లు, దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ సరయు సూచించారు. కృష్ణగిరి మార్కెట్‌లోని డైలీ కూరగాయల మార్కెట్‌లో రూ.1.10 కోట్లతో నిర్మిస్తున్న 77 దుకాణాల పనులను జిల్లా అధికారి పరిశీలించారు. కృష్ణగిరి పురపాలక సంఘం అధ్యక్షురాలు ఫరీదా నవాబ్, మున్సిపల్ ఇంజనీర్ భువనేశ్వరీ, మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణన్, అసిస్టెంట్ ఇంజనీర్ ఉలగనాథన్, అధికారులు పాల్గొన్నారు.

పీఎంకే కార్యకర్తల నిరసన

హోసూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టాళి మక్కళ్ కచ్చి (పీఎంకే) అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు అన్బుమణి రామదాస్‌కు వేరేపనిలేదని ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై ప్రస్తావిస్తుంటాడని వాటికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్టాలిన్ అభిప్రాయపడ్డారు. దీంతో అన్బుమణి రామదాస్ ఖండిస్తూ సీఎం స్టాలిన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పిఎంకే శ్రామిక విభాగం తమిళనాడు వ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కృష్ణగిరి పశ్చిమ జిల్లా పిఎంకే పార్టీ ఆధ్వర్యంలో హోసూరులో ప్రదర్శన నిర్వహించారు. అందుకు అనుగుణంగా కృష్ణగిరి పశ్చిమ జిల్లా పీఎంకే కార్యదర్శి గోవిందరాజుల ఆధ్వర్యంలో హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్ల జెండాను చేతపట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది పార్టీ కార్యకర్తలు, సభ్యులు నిరసనలో పాల్గొనగా వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.



కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

రెవెన్యూ సిబ్బంది విధుల బహిష్కరణ

హోసూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్ల సాధనకై హోసూరులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది విధులను బహిష్కరించారు. తమిళనాడు రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్రస్థాయి బహిష్కరణకు పిలుపుతో విధులను బహిష్కరించి సమ్మె చేపట్టారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఉందని వాటికి భద్రత కల్పించాలని కోరారు. జూనియర్, సీనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పేరు మార్పుకోసం ఉత్తర్వు జారీ చేయాలని, మూడేళ్లకు పైగా ఖాళీగా ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని, సీనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల పదోన్నతిలో నెలకొన్న సమస్యను పరిష్కరించేలా కన్సాలిడేటెడ్ సీనియారిటీకి సంబంధించి రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌తో వివరణలు ఇవ్వాలని, కారుణ్య నియామకాలలో 5 శాతానికి తగ్గించడాన్ని రద్దు చేసి మళ్లీ 25 శాతంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.